క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ

మోటకొండూర్: మోటకొండూర్ ఎస్‌ఐగా తేజంరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన మధుసూదన్ భువనగిరి క్రైమ్‌కు బదిలీపై వెళ్లారు. భువనగిరి టౌన్‌లో విధులు నిర్వహిస్తున్న తేజంరెడ్డి మోటకొండూర్‌కు బదిలీపై వచ్చారు.

విద్యుత్ స్తంభాన్ని మార్చాలి

వలిగొండ : మండలంలోని రెడ్లరేపాకలోని పల్లె దవాఖాన ఎదుట ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని వెంటనే మార్చాలని సీపీఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి డిమాండ్ చేశారు. బుధవారం రెడ్ల రేపాకలోని పల్లె దవాఖానను సీపీఎం ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె దవాఖానాలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో దొడ్డి భిక్షపతి, జువ్వగాని చంద్రయ్య , వెల్వర్తి యాదయ్య, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలి

బొమ్మలరామారం : గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో దొంగతనాలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక యువతతో కమిటీలు వేసుకుని రాత్రి వేళల్లో రక్షణగా ఉండాలన్నారు. ఆయన వెంట పలువురు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

'ఐఎన్‌టీయూసీ నూతన కమిటీలు నియమిస్తాం'

చౌటుప్పల్ : ఐఎన్‌టీయూసీ నూతన కమిటీలను త్వరలో నియమిస్తామని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సుడుగు జీవన్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక రాజీవ్‌స్మారక భవనంలో జరిగిన ఆ సఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.సమావేశంలో ఐఎన్‌టీయూసీ డివిజన్ అధ్యక్షుడు లగ్గోని వెంకటేశం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దేవేందర్, కందగట్ల చరణ్, వల్లకాటి రామచంద్రం పాల్గొన్నారు.

ముదిరాజ్‌లు రాజకీయంగా ఎదగాలి

బొమ్మలరామారం : ముదిరాజ్‌లు రాజకీయంగా ఎదగాలని భువనగిరి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కుషంగల సత్యనారయణ అన్నారు. బుధవారం మండలంలోని చీకటి మామిడి గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ముదిరాజ్‌లకు మొబైల్ చేప రుచుల క్యాంటీన్ల ఏర్పాటుకు ప్రభుత్వం సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గొడుగు శోభ చంద్రమౌళి, ఆ సంఘం మండల నాయకులు రాగుల బల్‌రాం, ఎలబోయిన రవిశంకర్, మేడబోయిన గణేష్, జింక నరేందర్,భాను, శ్రీహరి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న శ్రీకాంత్

వలిగొండ : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని బీఎస్పీ మండల అధ్యక్షుడు సుక్క శ్రీకాంత్ డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో బుధవారం బహుజన్ సమాజ్ పార్టీ మండల కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. ధాన్యం కొనుగోళ్ల నత్తనడకన సాగుతున్నాయని విమర్శించారు. అన్ని గ్రామాల్లో బూత్ కమిటీలు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో బాలసాని మహేందర్, గుండు కృష్ణ, గండమల్ల లింగ స్వామీ, శేఖర్, ప్రశాంత్, మల్లికార్జున్, నవీన్, బాబు పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ

అడ్డగూడూరు : జిల్లా కేంద్రంలో జరుగుతున్న సీఎం కప్ పోటీల్లో పాల్గొన్న కబడ్డీ క్రీడాకారులకు వైస్ ఎంపీపీ దైద పురుషోత్తం రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ చిప్పల పల్లి మహేంద్రనాథ్ బుధవారం క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఈటీలు యాదయ్య, బోనాల మహేష్, బీఆర్‌ఎస్ నాయకులు సురారం రాజు చిప్పలపెల్లి న రేందర్ , నవీన్, ప్రశాంత్, రాజు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణ పనులకు శంకుస్థాపన

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని కనుముకుల గ్రామంలో రూ.5లక్షల వ్యయంతో నిర్మిస్తున్న శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణ పనులకు బుధవారం ఎంపీపీ మాడ్గుల ప్రభాకర్ రెడ్డి, జెడ్పీటీసీ కోట పుష్పలత మల్లారెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పాక వెంకటేశ్, ఎంపీటీసీల ఫోరమ్‌మండల అధ్యక్షుడు బత్తుల మాధవిశ్రీశైలంగౌడ్, సర్పంచ్ కోట అంజిరెడ్డి, ఎంపీడీఓ బాలశంకర్, పీఆర్ ఏఈ వెంకటేశ్వర్లు, పాక జంగయ్య, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులకు..

సంస్థాన్ నారాయణపురం: మండలంలోని కొర్రతండాలో ఎస్‌డీఎఫ్ నిధులు రూ.25లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సర్పంచ్ కొర్ర లచ్చిరాం బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొర్ర నాను, కొర్ర శ్రీను, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు ఇలా.. ప్రయాణించేదెలా?

- కంకరతేలి గుంతలమయంగా మారిన గ్రామీణ రహదారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- మరమ్మతులు చేయాలని వేడుకోలు



అధ్వానంగా ఉన్న గుండాల -గంగాపురం రోడ్డు



కంకరతేలిన గుండాల-వస్తాకొండూర్ రోడ్డు

గుండాల : మండలంలోని గ్రామీణ రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. మండల కేంద్రం నుంచి పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. అడుగడుగునా గుంతలు, కంకరతేలిన రోడ్లపై ప్రయాణం నరకాన్ని తలపిస్తుందని పలువురు వాపోతున్నారు. మండల కేంద్రం నుంచి నూనెగూడెం వెళ్లే రోడ్డు, గుండాల నుంచి గంగాపురం రోడ్డు వెంట ప్రతి నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ రోడ్డంతా కంకర తేలి అధ్వానంగా మారడంతో ప్రయాణికులు ఈ రోడ్డు వెంట వెళ్లాలంటేనే జంకుతున్నారు.బండకొత్తపల్లి నుంచి దేవరుప్పులకు వెళ్లే రోడ్డు, రామారం గ్రామం నుంచి వెలమజాల, కొమ్మాయిపల్లి వరకు వెళ్లే బీటీ రోడ్డు పూర్తి దెబ్బతిని గుంతల మయంగా మారాయి. సీతారాంపురం గ్రామం నుంచి మరిపడిగ గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గంతో ఉన్న కల్వర్టు ధ్వంసమై ప్రమాదకరంగా ఉంది. గతంలో ఈ రోడ్ల మరమ్మతుల కోసం అధికారులు అంచనా వేసి ప్రభుత్వానికి నివేదికలు పంపినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అడుగడుగునా గుంతలే..

గుండాల నుంచి వస్తాకొండూర్, బండకొత్తపల్లికి వెళ్లే మట్టి రోడ్డు గుంతలమయంగా మారింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గుంతల్లో వర్షపు నీరు చేరడంతో కనీసం వ్యవసాయ బావులకు వెళ్లలేని పరిస్థితి నెలకొందని పలువురు రైతులు వాపోతున్నారు. వరాకాలంలోనైతే ఇబ్బందులు చెప్పలేనివికాదు. ప్రధాన రహదారులపైనే దృష్టి సారించిన పాలకులు పల్లె రోడ్లను పట్టించుకోవడం లేదని గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్ల మరమ్మతులు చేపట్టి తమ ఇబ్బందులు తొలగించాలని పలువురు కోరుతున్నారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టాలి

మండలంలో ధ్వంసమైన రోడ్లపై ప్రయాణించేందుకు ఇబ్బందులు పడుతున్నాం. ధ్వంసమైన రోడ్లకు నిధులు కేటాయించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నాం.

– మద్దెపురం రాజు, సీపీఎం మండల కార్యదర్శి



త్వరలో పనులు ప్రారంభిస్తాం

మండలంలో కంకరతేలి గుంతలమయంగా మారిన రోడ్ల పరిస్థితిని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపించాం. ధ్వంసమైన పలు రహదారులకు నిధులు మంజూరయ్యాయి. త్వరలో పనులు ప్రారంభిస్తాం.

–దామోదర్, పీఆర్ ఏఈ, గుండాల

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

తుర్కపల్లి: అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధానవత్ శంకర్‌నాయక్ అన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం సకాలంలో కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ధాన్యం కొనుగోళ్లను పూర్తి చేయాలని కోరుతూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్‌కు వినతి ప్రతం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు 30 శాతం ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలేదని విమర్శించారు. తడిసిన ధాన్యం రంగు మారుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి చాడ భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ మోహన్ బాబునాయక్, ప్రతిభారాజేశ్‌నాయక్, కానుగంటి శ్రీనివాస్, సర్పంచ్ బిచ్చునాయక్ , మండల ఉపాధ్యక్షుడు రాజారామ్‌నాయక్, అసద్‌బేగ్, సోమొల్ల వెంకటేశ్ వినోద్‌నాయక్, రాజునాయక్, దుర్వాసులు, రమేశ్, జగదీష్ పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

'మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా'

మోటకొండూర్: మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీ తామహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. వంగపల్లి–ఖప్రాయిపల్లి వరకు వయా మోటకొండూర్ మీదుగా 35కిలోమీటర్ల డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ. 18.70కోట్లు మంజూరయ్యాయన్నారు. రూ.5.65కోట్లతో పోలీస్ స్టేషన్ నుంచి వర్టూర్ రోడ్డులోని రాయికుంటపల్లి జంక్షన్ వరకు డబుల్ రోడ్డు సీసీ డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పల్లా వెంకట్‌రెడ్డి, ఎగ్గిడి బాలయ్య, నాగమణి, బీస కష్టరాజుగౌడ్, పన్నాల నవీన్‌రెడ్డి, అనంతుల జంగారెడ్డి, బురాన్, బొబ్బలి యాదిరెడ్డి, మల్లేష్‌యాదవ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొంగిడి సునీత

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

వలిగొండ : గ్రామాలను అన్నిరంగాల్లో అభివృద్ధి పర్చడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఆరూరులో అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ రోడ్లు, అండర్ డ్రెయినేజీలు, మత్స్యగిరి గుట్టవద్ద పైకి 3వ ఘాట్ రోడ్డు, ఆరూర్ గ్రామం నుంచి చెన్నకేశవస్వామి గుట్ట దగ్గర పెట్రోల్ పంప్ వరకు బీటీ రోడ్డు, కల్వర్టు నిర్మాణాలకు కోటి రూపాయల నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చిట్టెడి జనార్దన్‌రెడ్డి, చిట్టెడి వెంకట్‌రామ్‌రెడ్డి, సురకంటి వెంకట్‌రెడ్డి, పలుసం రమేష్, మొగుళ్ల శ్రీనివాస్, మర్రి వెంకటేష్, కొడితాల నాగరాజు, ఏనుగు అంజిరెడ్డి, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న జేపీఎస్‌లు, ప్రజా ప్రతినిధులు

సంస్థాన్ నారాయణపురం: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేస్తామని ప్రభుత్వం ప్రకటించడం, పంచాయతీల్లో పెండింగ్‌లో ఉన్న బిల్లులను విడుదల చేసినందుకు హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుత్త ఉమాదేవి, సర్పంచ్‌లు సికిలమెట్ల శ్రీహరి, సుర్వి యాదయ్య, మైలా యాదవరెడ్డి, జక్కర్తి పాపయ్య, ఒగ్గు గణేష్, పానుగోతు పాండురంగం, బోయిన వెంకటేష్, అమరేందర్, పాండు, మమత, సుభాష్, నరేష్, వెంకటేశ్వర్లు, సీహెచ్ సతీష్, శ్రీనివాస్, రఫీ పాల్గొన్నారు.

రామన్నపేట : పంచాయతీలకు సంబంధించిన పెండింగ్ బిల్లులు విడుదల చేయడం పట్ల శోభనాద్రిపురం సర్పంచ్ కాల్య యామిని శ్రవన్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

ట్రిపుల్‌ఆర్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



ట్రిపుల్ ఆర్ కేంద్రం వద్ద పాత దుస్తులు సేకరిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్

మోత్కూరు : మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసిన ట్రిపుల్ ఆర్ సెంటర్లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సి.శ్రీకాంత్ అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసిన పలు ట్రిపుల్ ఆర్ సెంటర్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లల్లో నిరుపయోగంగా ఉన్న ప్లాస్టిక్ వస్తువులు, పాత దుస్తులు, పాత పుస్తకాలను ట్రిపుల్‌ఆర్ కేంద్రాలకు అందజేయాలన్నారు. వచ్చే నెల 5వ తేదీ వరకు ఈ సెంటర్లు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



రామన్నపేట : ధ్వజ స్తంభానికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

రామన్నపేట : మండలంలోని బోగారం గ్రామంలో సీతారామచంద్రస్వామి దేవాలయంలో బుధవారం విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలను కనులపండువగా నిర్వహించారు. ఆచార్యులు బేతోజు సత్యనారాయణశాస్త్రి ఆధ్వర్యంలో ఉదయం గణపతి, నవగ్రహ, జల, ధాన్య, పుష్పాదివాస పూజలు నిర్వహించారు. అనంతరం యంత్రస్థాపన చేసి సీతారామచంద్ర స్వామి, లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహాలను, ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అంతటి పద్మారమేష్, ఎంపీటీసీ గోగు పద్మారమేష్, ఉపసర్పంచ్ జెల్ల శ్రీనివాస్, మాజీవైస్‌ఎంపీపీ బద్దుల ఉమారమేష్, మాజీసర్పంచ్‌లు కూనూరు గోపాలు, శంకరయ్య, గంపల రామచంద్రారెడ్డి, శివరంజని, రామలింగం పాల్గొన్నారు.

ఘనంగా సీతారామచంద్రస్వామి అలయ వార్షికోత్సవం

తుర్కపల్లి: మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం పుణ్యాహవచనం, ఆదిత్యాది నవగ్రహ పూజ, గణపతి హోమం, దేవతామూర్తులకు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చంద్రం,రాంరెడ్డి, లింగయ్య, ఇమ్మడి సంతోష్, వెంకటస్వామి, జగదీశ్, వెంకటేశ్, సిద్దులు, శివ, సురేశ్, వేణుగుప్తా పాల్గొన్నారు.

ఘనంగా దుర్గమ్మ పండుగ

భువనగిరి : మండలంలోని బండసోమారం గ్రామంలో బుధవారం దుర్గమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో డీసీపీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ నిర్మాణం కోసం రూ. లక్ష విరాళాన్ని అందజేశారు.

వెల్లంకిలో కాటమయ్య పండుగ

రామన్నపేట : మండలంలోని వెల్లంకి గ్రామంలో కాటమయ్య బోనాల వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలు ఎత్తుకుని డప్పుచప్పుళ్లతో ఊరేగింపుగా తీసుకువెళ్లి నైవేద్యంగా సమర్పించారు. కార్యక్రమంలో తాటిపాముల లింగయ్య, ఎల్లయ్య, శేఖర్, శివక్రిష్ణ, అంజయ్య, స్వామి, లింగస్వామి, మహేష్, శ్రీశైలం, కిరణ్, నర్సింహ, జువ్వగోని మధు, పాలెం స్వామి తదితరులు పాల్గొన్నారు.



బోనాలు ఎత్తుకుని వస్తున్న మహిళలు

భక్తిశ్రద్ధలతో బొడ్రాయి ప్రతిష్ఠాపన



బోనాలు ఎత్తుకుని వస్తున్న మహిళలు

తుర్కపల్లి: మండలంలోని దత్తాయపల్లి గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలు కొనసాగుతున్నాయి. బుధవారం గ్రామదేవతలు దుర్గమ్మ, పోచమ్మ, పెద్దమ్మలకు గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో బోనాలు సమర్పించారు. డప్పుచప్పుళ్లు, పోతరాజుల ఆటపాటలతో సందడి నెలకొంది.

రాజాపేటలో కురిసిన వర్షం

రాజాపేట : మండలంలోని పుట్టగూడెం, కొండ్రెడ్డిచెర్వు, పాముకుంట, రాజాపేట, బేగంపేట తదితర గ్రామాల్లో బుధవారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఈదురు గాలులకు బేగంపేట, పుట్టగూడెం, రాజాపేట గ్రామాల్లో చెట్లకొమ్మలు విరిగిపోయాయి. పలు చోట్ల విద్యుత్ స్తంభాలు కూలాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోయింది.

నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే చర్యలు



గుండాల : ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న వ్యవసాయ, పోలీస్ అధికారులు



మోటకొండూర్ : ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

భువనగిరి : పట్టణంలోని ఎరువుల, విత్తనాల దుకాణాల్లో బుధవారం వ్యవసాయ సహాయ సంచాలకులు నిలీమ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా దుకాణంలోని విత్తనాల ప్యాకెట్లు, స్టాక్ రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పోచంపల్లి, భువనగిరి మండల వ్యవసాయ అధికారులు ఆజాద్ ఖాన్, పావని తదితరులు పాల్గొన్నారు.

గుండాల :నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని యాదగిరిగుట్ట, ఆలేరు ఏడీఏలు డి.పద్మావతి, బి.వెంకటేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను బుధవారం పోలీస్ సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల స్టాక్ రిజిష్టర్లను, విత్తనాలను పరిశీలించారు. ప్రభుత్వం నుంచి లైసెన్స్ పొందిన ఎరువుల షాపులలోనే రైతులు విత్తనాలను కొనుగోలు చేయాలని సూచించారు. విత్తనాల శాంపిల్స్‌ను తీసి ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ యాకన్న మండల వ్యవసాయ అధికారి లావణ్య పాల్గొన్నారు.

మోటకొండూర్: నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏడీఏ భూక్యా దేవీసింగ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని విత్తనాలు, ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లోని స్టాక్ రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఓ మాధవి, సుజాత, దేవేందర్, నరేందర్, గోపికృష్ణ, రాజు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులకు అధిక ప్రాధాన్యం



చౌటుప్పల్ : వార్డుల్లో పర్యటిస్తున్న మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి



మోత్కూరు : పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్

చౌటుప్పల్ : పారిశుద్ధ్య పనులకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని మున్సిపల్ కమిషనర్ ఎస్.భాస్కర్ రెడ్డి అన్నారు. పట్టణ కేంద్రంలోని 12, 19వ వార్డుల్లో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వర్షాకాలన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని ప్రధాన కాలువలను శుభ్రం చేయిస్తున్నామన్నారు. వర్షపు నీరు సాఫీగా దిగువకు వెళ్లే విధంగా నాలాలు పరిశుభ్రం చేయాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట కౌన్సిలర్ తాడూరి శిరీషపరమేష్, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ హనుమాన్‌ప్రసాద్, పర్యావరణ ఇంజనీర్ రేణుకుమార్, వార్డు ఆఫీసర్లు బాలరాజు, పవన్‌కుమార్, జవాన్ అంజయ్య ఉన్నారు.

పారిశుద్ధ్య కార్యక్రమాలకు సహకరించాలి

మోత్కూరు : మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ సి.శ్రీకాంత్ కోరారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీ వరకు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది శ్రవణ్‌కుమార్, రాంబాబు, జంగ నాగరాజు, బయ్యని మోహన్ తదితరులున్నారు.

ట్యాంక్‌బండ్‌పై చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

బొమ్మలరామారం : ట్యాంక్ బండ్‌పై తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని రజక సంఘం మండల అధ్యక్షుడు ముదిగొండ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వీరనారీ ఐలమ్మ రజకుల ఆత్మగౌరవానికి ప్రతీకని ఆమె వీరోచిత పోరాట చరిత్ర భావి తరాలకు తెలిసేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు ఎడిజర్ల భూపాల్, భరత్ కుమార్, లింగం,అనిల్, బాలకృష్ణ,జంగయ్య, పాపులు, లింగయ్య, నర్సింహ, రాములు, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

'డబుల్' నిర్మాణాల్లో నాణ్యత లేదు : గూడూరు



డబుల్ బెడ్‌రూం ఇళ్లను పరిశీలిస్తున్న గూడూరు నారాయణరెడ్డి

బీబీనగర్: డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించలేదని బీజేపీ సీనియర్ నేత గూడూరు నారాయణరెడ్డి ఆరోపించారు. బీబీనగర్ మండల కేంద్రంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు 14 నిర్మించి అందులో 11 మందికి మాత్రమే ఇచ్చి ఎమ్మెల్యే చేతులు దులుపుకున్నారన్నారు. బీబీనగర్‌లో అనేక మంది నిరుపేదలు ఉన్నారని కేవలం 11 మందికి మాత్రం ఇస్తే ఎలా అని ప్రశ్నించారు. అది కూడా సరైన వసతులు కల్పించకుడా కేటాయించడం దారుణమన్నారు. రానున్న ఎన్నికలో ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డికి ప్రజలు తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. కార్యక్రమంలో జంగారెడ్డి, శ్యాంగౌడ్, రాజేందర్, లాలయ్య ఉన్నారు.

'ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు చేయడం తగదు'



మాట్లాడుతున్న దాసరి తిరుమలేష్

మోత్కూరు : నిరంతరం నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేస్తున్న ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌పై అసత్య ఆరోపణలు చేయడం తగదని ఎస్సీ, ఎస్టీ అండ్ విజిలెన్స్ మానిటరింగ్ జిల్లా కమిటీ మెంబర్ దాసరి తిరుమలేష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేపై చేస్తున్న దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నియోజకవర్గంలో అనేక మంది మాదిగలను కింది స్థాయి నుంచి ప్రోత్సహిస్తూ రాజకీయ అవకాశాలు కల్పిస్తున్నారన్నారు. ప్రతి దళిత కుటుంబానికి దశలవారీగా దళిత బంధు అందించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నారన్నారు. అడ్వకేట్ పర్రెపాటి యుగేంధర్‌పై జరిగిన దాడికి బీఆర్‌ఎస్‌కు ఏమాత్రం సంబంధం లేదన్నారు. ఈ సమావేశంలో ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు చెడిపల్లి రఘుపతి, బీఆర్‌ఎస్ సోషల్ మీడియా మండల కోఆర్డినేటర్ జిట్ట సాయికుమార్, నాయకులు దాసరి నరేష్, దాసరి నవీన్, బందెల శ్రీను, సాగర్, చుక్క సైదులు తదితరులు పాల్గొన్నారు.

నియంతృత్వ పాలనకు చరమగీతం పాడాలి

మోత్కూరు: కేంద్రం, రాష్ట్రంలో సాగుతున్న నియంతృత్వ పాలనకు చరమగీతం పాడాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొల్లు యాదగిరి అన్నారు. బుధవారం మండలంలోని పాలడుగు గ్రామంలో సీపీఎం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొమ్మిదేళ్ల మోదీ పాలనతో దేశ ప్రజలు విసిగిపోయారన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. సమావేశంలో మామిడి కృష్ణ, సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు, పైళ్ల రాంరెడ్డి, కనకయ్య, పానుగుల్ల రమేష్, దడిపల్లి ప్రభాకర్, కొంపెల్లి ముత్తమ్మ, పిట్టల చంద్రయ్య, వెండి యాదగిరి, చింతకింది సోమరాజు, వడ్డేపల్లి లక్ష్మణ్, కొంపెల్లి గంగయ్య, సైదులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

భువనగిరిటౌన్ : పట్టణంలోని సింగన్నగూడెంలో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న వారికి కనీస మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి మాయ కృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం సింగన్నగూడెంలో గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్న వారిని కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎల్లయ్య, ముత్యాలు, కృష్ణ ఉన్నారు.

పలువురికి ఆర్థికసాయం

గుండాల : మండలంలోని మరిపడిగ గ్రామానికి చెందిన డ్రైవర్ సజ్జనం సోమయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం రూ.10 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, సోమన్న, మహేందర్, సత్తయ్య, చంద్రయ్య, రాజేందర్, ఉప్పలయ్య, సోమయ్య, రాంరెడ్డి, అశోక్, ఎల్లేష్, సోమన్న పాల్గొన్నారు. మండలంలోని సుద్దాల గ్రామానికి చెందిన కందుకూరి వెంకటయ్య మృతి చెందాడు. బుధవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో రూ.5 వేల ఆర్థికసాయాన్ని మృతుడి కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శి నగేష్, ఆల్దా డైరెక్టర్ ఇమ్మడి దశరథ గుప్తా, శ్రీనివాస్, సతీష్, రమేష్, కోటేశ్వర్, కిరణ్, సత్తయ్య, సోమన్న, సంతోషం , లక్ష్మీనారాయణ, కృష్ణ, సురేష్ పాల్గొన్నారు.

వలిగొండ : మండలంలోని నాగారం గ్రామానికి చెందిన కాడిగళ్ల నర్సింహ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి సమకూర్చిన రూ.10 వేల ఆర్థికసాయాన్ని స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం మృతుడి కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మొగుళ్ల శ్రీనివాస్, బర్ల నాగార్జున, ఎండీ సలీం, బాబు, శ్రీనివాస్, పాలేర్ల మహేష్, కొంపెల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'చెత్త' ట్రాక్టర్



ట్రాక్టర్‌ను తోస్తున్న మున్సిపల్ సిబ్బంది

భువనగిరిటౌన్ : చెత్త సేకరించే ట్రాక్టర్ స్టార్ట్ కాకపోవడంతో మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది నానా తిప్పలు పడిన ఘటన బుధవారం భువనగిరి పట్టణంలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలోని కిసాన్‌నగర్‌లో చెత్త సేకరించి తిరిగి డపింగ్‌యార్డు వెళ్లే క్రమంలో మున్సిపల్ చెత్త సేకరణ ట్రాక్టర్ ఒక్కసారిగా ఆగిపోయింది. ఎంతకూ స్టార్ కాకపోవడంతో మున్సిపల్ కార్మికులు ట్రాక్టర్‌ను తోసుకుంటూ కొద్దిదూరం వరకు తీసుకెళ్లారు. అనంతరం మరమ్మతులు చేయించడంతో ట్రాక్టర్ స్టార్ అయ్యింది. మున్సిపాలిటీకి సంబంధించిన వాహనాల నిర్వహణ సరిగా లేకపోవడంతోనే అప్పుడప్పుడు మున్సిపల్ వాహనాలు రోడ్లపై ఆగిపోతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.